## క్లుప్తంగా

### శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం



దాత మోహన్‌రావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా బుధవారం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా భీమవరం మండలం నరసయ్య అగ్రహారానికి చెందిన సోడిశెట్టి వీరవెంకట మోహన్ రావు రూ.1,00,111 ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే గన్నవరానికి చెందిన ఒ.మోహన రంగారావు రూ.లక్ష నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేయగా, ఆలయ సూపరింటెండెంట్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు. దాత కుటుంబాలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

### రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: పోలవరం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 400 కేవీ లైన్ గుడ్డిగూడెం 400 కేవీ సబ్‌స్టేషన్ వరకు ట్రాన్స్‌మిషన్ కొత్త లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ రాధాకృష్ణ తెలిపారు. ఈ నేపథ్యంలో పోలవరం, దేవరగొంది సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఏపీ ఎస్ఈటీ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత

జంగారెడ్డిగూడెం: ఏపీ ఎస్ఈటీ పరీక్షల్లో జంగారెడ్డిగూడెంకు చెందిన జల్లిపల్లి రాజా శ్రీకాంత్ ఉత్తీర్ణత సాధించారు. బుధవారం ప్రకటించిన ఈ ఫలితాల్లో స్థానిక సీఎస్‌టీఎస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అతిథి అధ్యాపకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీకాంత్ ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ అభినందనలు తెలిపారు.

### మధ్యాహ్న భోజన కార్మికులకు వంటల పోటీలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ రామారావు

లింగపాలెం: స్థానిక శింగగూడెం హైస్కూల్లో మధ్యాహ్న భోజన కార్మికుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం వంటల పోటీలు నిర్వహించారు. గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో అన్నం, పులిహోర పప్పు సాంబారు తదితరాలను ప్రదర్శించగా వంటలను ఎంఈఓ రామారావు, రిసోర్స్‌పర్సన్ శోభ రుచి చూశారు. ఈ శిక్షణా కార్యక్రమానికి 58 మంది మధ్యాహ్న భోజన కార్మికులు హాజరయ్యారు. మండల విద్యాశాఖ అధికారి రామారావు ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శోభ, సీఆర్ఎంటీలు టి.కనకరాజు, జి.కుమార్ మంగళం, టి.సునీత తదితరులు పాల్గొన్నారు.

# రహదారి అభివృద్ధి పనులు పూర్తి

- రూ.5 కోట్లతో శివపురం – పోతునూరు రహదారి అభివృద్ధి
- రహదారి కష్టాలు తీరడంతో ప్రజల హర్షాతిరేకాలు




అధ్వానంగా ఉన్న శివపురం - పోతునూరు రహదారి (నాడు)




నూతన రహదారి నిర్మాణం అనంతరం శివపురం - పోతునూరు రోడ్డు (నేడు)

చింతలపూడి: మండలంలోని యండపల్లి, పోతునూరు ప్రధాన రహదారిని సుమారు 5 కోట్ల రూపాయలతో ఇటీవల అభివృద్ధి చేశారు. గత రెండు దశాబ్దాలుగా ఈ రహదారి గోతులు పడి అధ్వాన్నంగా ఉండేది. ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాలకు వచ్చిన సందర్భంలో ప్రజలు రహదారిని అభివృద్ధి చేయమని మొరపెట్టుకునే వారు. ఎట్టకేలకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు చొరవతో స్థానిక జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్ చేసిన కృషి వల్ల ప్రభుత్వం యండపల్లి– శివపురం రహదారికి రూ.ఐదు కోట్ల నిధులను మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందే రహదారి పనులు పూర్తికావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పోతునూరు శివపురం, మల్లేశ్వరం, గుళ్ళపాడు, యండపల్లి గ్రామాల ప్రజలు ఇటు నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడి రావాలన్నా, కృష్ణా జిల్లా విస్సన్నపేట, తిరువూరు, అటు తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి, ఖమ్మం వెళ్లాలన్నా ఈ రహదారి గుండానే ప్రయాణించేవారు. గతంలో వచ్చిన తుపానుల కారణంగా అధిక వర్షాలు కురవడంతో ఈ రహదారి పెద్దపెద్ద గోతులు పడి వాహనాల రాకపోకలకు అంతరాయంగా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం మాత్రమే కాకుండా పనులు కూడా ప్రారంభించి పూర్తి చేయడంతో గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరింది.

### జగన్ సర్కార్‌తోనే అభివృద్ధి



గత రెండు దశాబ్దాలుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామస్తుల కోరిక మేరకు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు సహకారంతో ప్రభుత్వం నుంచి రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకున్నాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కూడా సమాంతరంగా జరిగిందనడానికి ఇదే నిదర్శనం.

– మొలుగుమాటి నీరజా సుధాకర్, జెడ్పీటీసీ, చింతలపూడి

### ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు



రోడ్డును అభివృద్ధి చేయాలని ఎంతోకాలం నుంచి పోరాడుతున్నాం. గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు కూడా పూర్తి చేయడం అభినందనీయం. రోడ్డు అభివృద్ధికి కృషి చేసిన ప్రజా ప్రతినిధులందరికీ కృతజ్ఞతలు.

– గుత్తా కిషోర్, ఎంపీటీసీ, యండపల్లి

### స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన ఆర్వో



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఆర్వో అద్దయ్య

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను ఆర్వో, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య బుధవారం పరిశీలించారు. పెదపాడు మండలం పరిధిలోని వట్లూరు సర్. సీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కె.అద్దయ్య మాట్లాడుతూ ఈవీఎంల భద్రత అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలకు ప్రభుత్వం మూడు అంచెల భద్రత కల్పించిందన్నారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు పరిశీలన చేశారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేశారు. మూడంచెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్‌డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను అద్దయ్య పరిశీలించారు.ఈవీఎం కంట్రోల్ రూంను పరిశీలించారు.

## ఆర్‌బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం



వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా

చింతలపూడి: వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌డివిజన్‌లో అవసరమైన రైతులకు జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు రాయితీపై అందజేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయాలని ఆదేశించారు. రాబోయే ఖరీఫ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లభ్యతపై తగిన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకులను రైతు భరోసా కేంద్రాల ద్వారా జరుగుతున్న పురోగతిపై సమీక్షించారు. ఎన్నికల విధులతోపాటు రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్ సరఫరాను కూడా వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, మండల వ్యవసాయాధికారులు కె మీనాకుమారి, సీహెచ్ పవన్‌కుమార్, బి సుమలత, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏఓ ప్రవీణ్‌కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

### చెట్ల నరికివేతను అడ్డుకున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం: సరిపల్లి గ్రామ పంచాయతీ పరిధి సరిపల్లి గ్రామంలో వడ్ల రామయ్య చెరువుగట్టుపై కొందరు చెట్లను నరికివేయడంపై గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా రాజవరం గ్రామానికి చెందిన దుగ్గిరాల రాంబాబు, సరిపల్లి గ్రామానికి చెందిన జొన్నకుటి రాజేష్ అనే వ్యక్తులు నలభైకి పైగా చెట్లను అక్రమంగా నరికివేస్తూ ఉండగా సరిపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనితో వారు ఆగ్రహించి తమపై ఘర్షణకు దిగారని గ్రామస్తులు మైరెడ్డి లక్ష్మణరావు, మంచాల జయరాజు, పెనిమిల్లి వీరాస్వామి, కె.వంశీ వీఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారి వెళ్లి విచారణ నిర్వహించి చెట్లు అక్రమంగా నరికి వేసినట్లు నిర్ధారించుకున్నారు. నీటిపారుదల శాఖ డీఈ రవీంద్రబాబు స్పందించి వారిపై కేసు నమోదు చేస్తామని అన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



శిక్షణ ఇస్తున్న ఎంఈవో, ట్రైనీ



శిక్షణకు హాజరైన మధ్యాహ్న భోజన పథక సిబ్బంది

టి.నరసాపురం: మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈవో ఎస్. కళ్యాణి సూచించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న వంట సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కళ్యాణి, ట్రైనీ కె.అపరంజమ్మ వంట తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



కుక్కునూరులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కునూరు: కుక్కునూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చేబ్రోలు గీతావాణి అధ్యక్షతన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై చర్చించారు. మండలంలో విద్యుత్ హెచ్చు, తగ్గులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కివ్వాక ఆర్‌అండ్ ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కుక్కునూరు ఏ బ్లాక్ నిర్వాసితులకు రెండు హ్యాండ్ బోర్లు వేసి నీటి సమస్యను పరిష్కరించాలని సభ్యులు కోరారు. అలాగే మండలంలో వాంతులు, విరోచనాల కేసులు నమోదవుతుండడంతో వాటిని అరికట్టే దిశగా తగు చర్యలు చేపట్టాలని సమావేశంలో చర్చించారు. పారిశుధ్యం సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, వైస్ ఎంపీపీలు తాండ్ర రాజేష్, గాడిద రామచంద్రం, ఎంపీడీఓ నరిసింహరావు, వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ కార్యదర్శి ఎస్‌కే గౌస్

కుక్కునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులకు వెంటనే ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించి న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపందా జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్‌కే గౌస్ డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ ప్రజా పందా ముఖ్యనాయకుల, కార్యకర్తల సమావేశం బుధవారం కుక్కునూరు పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో గౌస్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితుల పట్ల ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. 2016 సంవత్సరం నుంచి నేటి వరకు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించకుండా నిర్వాసితులను నిలువునా గోదావరి వరదల్లో ముంచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రాజెక్ట్ నిర్మాణంపై చూపిన శ్రద్ధ నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో చూపడంలేదన్నారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన కోట్లరూపాయల పరిహారాన్ని కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నారని ఆరోపించారు. 2017 ఆర్‌అండ్‌ఆర్ కటాఫ్ తేది జీఓను రద్దుచేసి కొత్త జీఓ ఇచ్చి ప్రస్తుతం 18 ఏళ్లు నిండిన యువతి, యువకులకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించాలని, మండలాన్ని యూనిట్‌గా తీసుకోని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బాసినేని సత్యనారాయణ, కంగాల కల్లయ్య, ఎం మల్లేశం, ఎం లక్ష్మయ్య, ఎం ముత్తమ్మ, పీఓడబ్ల్యూ డివిజన్ సహాయ కార్యదర్శి ఎస్‌కే మున్ని తదితరులు పాల్గొన్నారు.

### ఏలూరులో 2న సంగీత విభావరి

ఏలూరు (టూటౌన్): ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 78వ జయంతి సందర్భంగా జూన్ 2వ తేదీ ఆదివారం ఏలూరులో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు హేలాపురి సింగర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్ నందు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్ రవి,కోశాధికారి యు.రవిశంకర్, కమిటీ నాయకులు పి.సూర్యప్రకాష్, కె.శ్రావణ కుమారి మాట్లాడుతూ ఏలూరు వైఎంహెచ్‌ఏ హాల్ నందు జూన్ 2వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పాటల పల్లకి పేరు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 40 పాటలతో గాయకులు పాల్గొనేలా కార్యక్రమం రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

### కౌంటింగ్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు

దెందులూరు: జూన్ 4న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి బీ లావణ్యవేణి అన్నారు. బుధవారం దెందులూరు ఆర్వో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ సెంటరులో 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 14 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందన్నారు. ప్రతి రౌండ్ కౌంటింగ్ సమాచారాన్ని మీడియా సెంటరుకు అందిస్తామన్నారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ మూడంచెల భద్రతా వలయం, కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలు, ఆర్మ్‌డ్ పోలీసులతో బందోబస్తు, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణలో ఉందన్నారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని తెలిపారు. నెలాఖరులోపు రాజకీయ పార్టీలు ఇచ్చిన జాబితాలో నేరచరిత్ర లేని వారిని 17 మందిని కౌంటింగ్ ఏజెంట్లుగా పోలీస్‌శాఖ వారి దర్యాప్తు అనంతరం అనుతిస్తామన్నారు. కౌంటింగ్ విధులకు హాజరయ్యే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామని జాయింట్ కలెక్టర్, ఆర్వో లావణ్యవేణి వివరించారు.

### చామంతులతో పూజలు

పెదపాడు: అప్పనవీడులో అభయాంజనేయస్వామికి బుధవారం 1008 చామంతి పూలతో ప్రత్యేక పూజలు జరిపారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, పద్మావతి దంపతులు పాల్గొని స్వామివారికి చామంతి పూలు, తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజామునుంచి దేవాలయ అర్చకులు సుప్రభాతసేవ, అర్చనలు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# ఉత్సాహంగా ఎన్‌సీసీ క్యాంప్



పెరేడ్ నిర్వహిస్తున్న విద్యార్థులు



రైఫిల్ షూటింగ్‌లో పాల్గొన్న క్యాడెట్లు



డైమండ్ షూటింగ్, మెలకువలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- జిల్లా వ్యాప్తంగా 501 మంది విద్యార్థులు హాజరు
- షూటింగ్‌లో అదరగొట్టిన క్యాడెట్లు
- వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారులు

పెదవేగి: పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయంలో గత కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్ ఉత్సాహంగా సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 501 మంది విద్యార్థులకు ఇండియన్ ఆర్మీ 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ ఎం వెంకటరత్నం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడంతోపాటు వివిధ రకాల ఉద్యోగాల్లో, కళాశాల అడ్మిషన్‌లలో ప్రాధాన్యత కల్పిస్తారు. శిక్షణలో భాగంగా రైఫిల్ షూటింగ్, డ్రిల్, దేశ సరిహద్దుల్లో ఆర్మీ శిబిరాలు ఏ విధంగా ఉంటాయో కళ్లకు కట్టినట్లు చూపించి కేడెట్స్‌కు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీలో శిక్షణ ద్వారా దేశభక్తి, నైతిక విలువలు పెంపొందింపజేయడం, క్రమశిక్షణ, సాయం చేసే తత్వం అలవడతాయని అధికారులు పేర్కొంటున్నారు.



రైఫిల్ షూటింగ్ కోసం ఆయుధాలు

### ఏ రంగంలోనైనా రాణించవచ్చు



ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని పాఠశాలల్లో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కచ్చితంగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు, క్రమశిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, వివిధ రకాల నైపుణ్యాలపై నిపుణులచే అవగాహన కల్పిస్తున్నాం. విద్యతోపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు.

– సౌరబ్ ముఖర్జీ ఇండియన్ ఆర్మీ 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్

### క్యాంప్ చక్కగా ఉపయోగపడుతుంది



యువతకు సరైన రీతిలో శిక్షణ ఇచ్చి విలువలతో కూడిన విద్య అందించడంతో పాటు దేశరక్షణలో వారి పాత్రను తెలియజేసేందుకు ఇటువంటి క్యాంప్‌లు ఉపయోగపడతాయి. ఆర్మీలో రక్షణ దళం ఎలా పనిచేస్తుంది, రోప్‌తో చేసే విన్యాసాలు, రైఫిల్ షూట్ ఇలా అనేక అంశాలపై అవగాహన కల్పించాం. ఈ క్యాంప్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల మధ్య మంచి వాతావరణం నెలకొల్పడం జరిగింది.

– ఎంహెచ్ఎస్ శేఖర్ కుమార్, ఫస్ట్ ఆఫీసర్, భీమవరం

### ఆర్మీలో చేరాలనేది నా లక్ష్యం



ఆర్మీలో చేరాలనేది నా లక్ష్యం. దేశ రక్షణలో సుభాష్‌చంద్రబోస్ ఆదర్శంగా తీసుకుని దేశానికి సేవ చేస్తా. ఈ క్యాంప్‌లో ఫైరింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, ఐకమత్యం, క్రమశిక్షణ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

– కె ఝాన్సీ, ఎస్‌కేఎస్‌టీ కళాశాల, తణుకు

### ప్రోత్సాహం బాగుంది



నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. ప్రస్తుతం బి సర్టిఫికెట్ చేస్తున్నాను. ఢిల్లీ పెరడ్ చేయాలని, ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో మంచి ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది. మా ఎన్‌సీసీ ఆఫీసర్ నాకు మంచి ప్రోత్సాహం అందిస్తున్నారు.

– జి.మోక్షిత్ సాయిజగన్, సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్, ఏలూరు

### ఉన్నతంగా ఎదగడానికి దోహదం



నేను ఐదు క్యాంప్‌లో పాల్గొన్నా. ప్రస్తుతం పెదవేగిలో 10 రోజులపాటు నిర్వహిస్తున్న క్యాంప్ ఎంతో ఉత్సాహంగా జరుగుతుంది. ఇలాంటి శిక్షణా తరగతులు విద్యార్థి జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి ఎంతో చక్కగా ఉపయోగపడతాయి.

– ఎల్ కూషేంద్రకుమార్, కెడెట్, భీమవరం

### క్రమశిక్షణతో విజయాలు



ఈ క్యాంప్‌లో క్రమశిక్షణ, అన్ని రకాల స్కిల్స్ ఎంతో శ్రద్ధగా నేర్పిస్తున్నారు. ఆత్మస్థైర్యంతో ఏ విధంగా ముందుకు వెళ్లాలో చెప్పారు. సమయం సద్వినియోగం చేసుకోవడం నైతిక విలువలతో జీవించడం వంటి ఎన్నో విషయాలు నేర్పుతున్నారు. క్రమశిక్షణతో విజయాలు సాధించవచ్చని అర్థమైంది.

– ఎం వెంకట మౌనిక, సెయింట్ థెరిస్సా కళాశాల ఏలూరు